# పెట్రోల్ డీజిల్ ధరల నిరంతర పెంపుతో ప్రజలపై మోపుతున్న మరింత భారం

**కరోనా** దెబ్బతో ప్రజల జీవితాలు అతలా కుతలమయ్యాయి. వాస్తవానికి దీనికంటే, ఈ సాకుతో ప్రభుత్వాలు ప్రజలపై మోపుతున్న భారాలతో సామాన్య, మధ్యతరగతి ప్రజల జీవన స్థితిగతులు మరింతగా దిగజారుతున్నాయి. ఇటీవల వరుసగా (జూన్ 8 నుండి 28 వరకు) పెట్రోల్, డీజిల్ ధరలు రోజూ పెరుగుతూ వుండటం మన గమనంలో వున్నదే! 21 రోజులుగా (28-6-21దాకా) రోజూ సగటున లీటర్‌కు 55-60 పైసల చొప్పున ఈ కాలంలో పెట్రోల్, డీజిల్ ధరలపై లీటర్‌కు 9-11 రూ. చొప్పున పెంచారు. ప్రజలను అన్నివిధాలా ఆదుకుంటామని ఒకవైపున ఊదరగొడ్తూనే కష్టకాలంలో ప్రజలను నిర్దాక్షిణ్యంగా దోచుకోవటం మినహా ఇది వేరుకాదు.

కరోనా కాలంలో పనులు నిలిచిపోయి ప్రభుత్వాలు, వివిధ సేవా సంస్థలు అందించే సాయం ఏ మూలకూ సరిపోక కష్టజీవులు దిక్కుతోచని స్థితిలో వున్నారు. ఇదే అదనుగా రెండు నెలల విద్యుత్తు రీడింగ్‌ను ఒకేసారి నమోదుచేసి పైగా యూనిట్ ధరను పెంచి, కొత్త 'శ్లాబు'లతో పెద్ద మొత్తాలలో ప్రజలపై విద్యుత్తు బిల్లుల భారాలను మోపారు. నిత్యావసరాల సరఫరా సక్రమంగా లేని ఈ కాలంలో ఏర్పడిన డిమాండ్‌తో సరుకుల ధరలు పెంచివేశారు. కూరగాయల ధరలు పెరిగిపోతున్నాయి. లీటరుకు నాలుగు రూ॥ల చొప్పున పాల ధరను పెంచారు.

నానాటికీ పెరిగిపోతున్న పెట్రోల్, డీజిల్ ధరలతో సరుకు రవాణా ఛార్జీలు పెరిగి వినియోగదారులు అధికంగా చెల్లించాల్సి వస్తోంది. ప్రజారవాణా ఛార్జీల పెంపుదలకు రంగం సిద్ధమైవుంది. వంటగ్యాసు ధర మరింత భారమౌతోంది. కరోనా నిబంధనలతో ఆటో, ట్యాక్సీ డ్రైవర్లకు జీవనోపాధి కష్టమైంది. ఒకరిద్దరు ప్రయాణీకులను మాత్రమే ఎక్కించుకోవాలనే నిబంధనలతోపాటు, పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదలతో వారు వాహనాలను నడపలేని స్థితి ఏర్పడుతోంది. ఖరీఫ్ సీజన్‌లో పంపుసెట్ల వినియోగంతో రాష్ట్రంలో రైతాంగంపైననే అదనంగా 500 కోట్ల రూ॥ భారం పడనుంది.

లాక్‌డౌన్ కాలంలో దేశవ్యాపితంగానూ, ప్రపంచంలోనూ ఇంధన వినియోగం తగ్గిపోయి ముడిచమురు ధరలు రికార్డు స్థాయిలో కనిష్ఠ ధరకు(బ్యారల్ 20 డాలర్లకు) పడిపోయాయి. ఆ సమయంలో ప్రపంచ వ్యాపితంగా ముడిచమురు నిల్వలు 18,000 కోట్ల బ్యారెల్స్ గరిష్టస్థాయికి చేరుకున్నాయి. మనదేశంలో చమురు నిల్వ సామర్థ్యం గరిష్టంగా 53 లక్షల టన్నులు మాత్రమే. ఇది దేశంలో తొమ్మిదిన్నర రోజుల అవసరాలకు మాత్రమే సరిపోతుంది. అంతర్జాతీయంగా గరిష్ట నిల్వ సామర్థ్యానికి మించి చమురు ఉత్పత్తి జరిగిన ఆ సమయంలో డబ్బు ఎదురిచ్చి మరీ చమురును విక్రయించారని బిజినెస్ పత్రికలు కథనాలు వెలువరించాయి. అంతర్జాతీయంగా చమురు వినియోగం తగ్గటం ఒక్కటేగాక, అధికంగా ముడిచమురు ఉత్పత్తిచేసే దేశాలైన సౌదీఅరేబియా, రష్యాల మధ్య నెలకొన్న వాణిజ్య వైరుధ్యాలూ చమురు ధరలు కనిష్టస్థాయికి చేరుకోవటానికి దోహదం చేశాయి. ఏమైనా చమురు ధరలు అత్యంత కనిష్టస్థాయికి పడిపోయిన ఆ సమయంలో కూడా మనదేశంలో పాలకులు వినియోగదారులకు పెట్రోల్, డీజిల్ ధరలను ఏమాత్రం తగ్గించలేదు.

కారణం స్పష్టమే! కేంద్రప్రభుత్వం పెట్రోల్‌పై 54 శాతం, డీజిల్‌పై 45 శాతం ఎక్సైజ్ పన్ను రూపంలో ఆదాయం పొందుతోంది. ఇదికాక, వివిధ రాష్ట్రాల్లో ఆయా ప్రభుత్వాలు విధించే పన్నులు కూడా కలిపితే (తాజా సవరణలతో కలిపి) పెట్రోల్‌పై లీటర్‌కు 64 శాతం, డీజిల్‌పై 63 శాతంగానూ పన్నుల భారం మోపుతున్నారు. కనుక పెట్రోల్, డీజిల్‌పై అసలు ధరకన్నా పన్నుల భారమే అధికమని స్పష్టమౌతోంది. ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు విధించే అమ్మకం పన్ను, వ్యాట్ తదితర పన్నులలో వుండే తేడాల కారణంగా వివిధ రాష్ట్రాలలో పెట్రోల్, డీజిల్ ధరలలో తేడాలుంటున్నాయి. ఇంతేగాక ఈ సం॥ మార్చి 14 నుండి కేంద్రప్రభుత్వం పెట్రోల్, డీజిల్‌లపై లీటర్‌కు 3 రూ॥చొప్పున ఎక్సైజు పన్ను పెంచి వసూలు చేస్తోంది. గత 5 సం॥ల కాలంలో కేంద్రప్రభుత్వానికి పెట్రోల్, డీజిల్‌లపై పన్నుల ద్వారా ఆదాయం 3 లక్షల 32 వేల కోట్ల రూ॥ల నుండి 5 లక్షల 55వేలకోట్ల రూ॥ ఎగబాకింది. ప్రస్తుత జూన్ మాసంలో వరుసగా పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలపై పెరిగిన పన్నుల రూపంలోనే కేంద్ర ఖజానాకు ఒక లక్షా 75వేల కోట్ల ఆదాయం సమకూరుతుందని అంచనా.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెట్రోల్, డీజిల్ అమ్మకంపై పన్నుల ద్వారా వచ్చే రాబడిని ప్రధాన ఆదాయ వనరుగా పరిగణించి, అసలు ధరను మించి పన్నులను పెంచుకుంటూ పోవటం ఈ ధరల పెరుగుదలకు తక్షణ ప్రధాన కారణంగా వుంది. ఇరాన్ వంటి దేశాలు చౌకగా ముడిచమురు సరఫరాకు సిద్ధమైనప్పటికీ, అమెరికా సామ్రాజ్య వాదుల అదుపాజ్ఞలకు లోబడిన భారత దళారీ పాలకులు దానికి పూనుకోకపోవటం ఈ సమస్యకు ప్రధాన కారణం. అంతేగాక దేశీయంగా చమురు నిక్షేపాల అన్వేషణ, చమురు వెలికితీత, నిల్వ సామర్థ్యాలను దేశ అవసరాలకనుగుణంగా పెంచు కోవటంతోపాటుగా, వ్యక్తిగత వాహన వినియోగం స్థానంలో ప్రజారవాణా వ్యవస్థను ప్రోత్సహించటం ద్వారా పెట్రోల్, డీజిల్ వినియోగాన్ని తగ్గించే చర్యలు చేపట్టటమూ అవసరం.

ooo